సాక్షి
జగిత్యాల
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024





చవితి సందడి

జిల్లావ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. నిర్వాహకులు శుక్రవారం గణనాథులను మంటపాలకు తరలించారు. శనివారం మంటపాలతో పాటు ఇళ్లలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు అన్ని సిద్ధం చేస్తున్నారు. పూజా సామగ్రితో పాటు చిన్న గణనాథులను కొనేందుకు ప్రజలు మార్కెట్‌కు తరలిరావడంతో టవర్ ప్రాంతమంతా రద్దీగా మారింది. – జగిత్యాలటౌన్

న్యూస్‌రీల్

శాంతియుతంగా జరుపుకోవాలి



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల: శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఉత్సవాలకు సంబంధించి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గణపతి మండపాల వద్ద ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని, విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసినప్పుడు పాతవైర్లను ఉపయోగించరాదని, షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి డీజే సౌండ్లకు అనుమతి లేదని, ఆస్పత్రులు, పాఠశాలల వద్ద మండపాలు ఏర్పాటు చేస్తే వారికి ఇబ్బంది కలిగించవద్దన్నారు. వాట్సప్‌లో ఫేక్ సందేశాలు పంపిస్తుంటారని, వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ, మెట్‌పల్లిలో 16న నిమజ్జనం ఉంటుందని, చావడి వద్ద అన్ని విగ్రహాలు వచ్చిన తర్వాత అక్కడి నుంచి మట్టి వాగుకు వెళ్తాయన్నారు. కోరుట్ల డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ, కోరుట్లలో 17న నిమజ్జనం ఉందని, అన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, హన్మంతరావు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి



మట్టి వినాయకులను అందజేస్తున్న డీడబ్ల్యూవో నరేశ్

జగిత్యాల: మట్టి వినాయకులనే పూజించాలని డీడబ్ల్యూవో బోనగిరి నరేశ్ అన్నారు. శుక్రవారం చేతన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయకులను వాడకూడదని, వాటి వల్ల ప్రకృతికి చాలా నష్టం కలుగుతుందన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోట శివకుమార్, సభ్యులు రాజ్‌కుమార్, పడకంటి శంకర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాలరూరల్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రాజెక్టులో 80.5 టీఎంసీల నీరు (1089.90 అడుగులు)ఉంది. 42,742 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2,882 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. ఇందులో మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, వరదకాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

లింగనిర్ధారణ నేరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సమియొద్దీన్

జగిత్యాల: లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో సమియొద్దీన్ అన్నారు. శుక్రవారం వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 73 స్కానింగ్ సెంటర్లున్నాయని పేర్కొన్నారు. ఎక్కడ కూడా లింగ నిర్ధారణ చేసినట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలుంటాయన్నారు. గ్రామాల్లో గర్భిణులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు దృష్టికి వస్తే ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు, జైలు శిక్షకు గురవుతారన్నారు. ప్రతీ అల్ట్రాసౌండ్ మిషన్‌ను రిజిష్టర్ చేయించాలని, వాటిని వాడే రేడియాలజిస్టులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన


కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులు పరిశీలించి, జ్వర పీడితుల వివరాలు తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటా సర్వే నిర్వహించి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట హెల్త్ ఎడ్యుకేటర్ రమణ, ఏఎన్‌ఎంలు ఉన్నార

కేబుల్ నెట్.. కరెంట్ షాక్

- దాదాపు 15 రోజుల క్రితం.. కోరుట్లలోని రథాల పంపులో ఓ పాత విద్యుత్ స్తంభానికి కరెంటు షాక్ వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇదివరకే తొలగించిన స్తంభం కావడంతో దానికి కరెంటు వైర్లు లేవు. షాక్ ఎందుకు వస్తోందని విద్యుత్ సిబ్బంది అయోమయంలో పడ్డారు. సదరు స్తంభానికి డిష్ వైర్ ఉండడమే కారణమని తెలుసుకుని సదరు వైర్‌ను కట్ చేశారు. ఎవరైనా పొరపాటున ఆ స్తంభాన్ని తాకితే ప్రాణాలు గాలిలో కలిసేవని విద్యుత్ సిబ్బంది చెప్పడం గమనార్హం.

- కోరుట్లలోని ఎస్‌బీఐ సమీపంలో 11 కేవీ వైర్ కింద నుంచి డిష్ వైర్లు వేలాడదీయడం ప్రమాదకరంగా మారింది. ఒక్కోసారి 11 కేవీ వైర్ నుంచి ఒక ఫీట్ వరకు ఇండక్షన్ వచ్చి డిష్ కేబుల్ వైర్లకు తగిలి ఆ పరిసర ఇళ్లలోని విద్యుత్ పరికరాలు దెబ్బతినే అవకాశముంది. ఇళ్లలో ఉండే వారు ప్రమాదవశాత్తు కేబుల్ వైర్‌ను ముట్టుకుంటే షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.





- విద్యుత్ స్తంభాలకు అడ్డగోలుగా వైర్లు
- పొంచి ఉన్న ప్రాణాపాయం
- ఇటీవల మెట్‌పల్లిలో కేబుల్ వైర్‌కు షాక్ రావడంతో మృతి చెందిన రహమత్



‘మెట్‌పల్లి పట్టణంలో గత సోమవారం ఓ ఇంటిపై ఉన్న డిష్ వైర్‌ను సరిచేస్తుండగా రహమత్ అనే వ్యక్తికి కరెంటు షాక్ తగిలి ప్రాణాలు వదిలాడు. విద్యుత్ స్తంభాలకు ఉన్న డిష్‌వైర్లు ఎక్కడో ఎర్త్ కావడంతోనే షాక్ వచ్చి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు’.

కోరుట్ల: డిష్ కేబుల్ వైర్లు, నెట్ కనెక్షన్ వైర్లు, కరెంటు వైర్లు ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలకు వేలాడదీయడం కోరుట్ల పట్టణంలో సమస్యగా మారింది. ఆ తీగలే ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు డిష్ కేబుల్, నెట్‌వైర్లు కడుతున్న సందర్భంలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది.

అసలే వర్షాకాలం.. ఆపై గాలులు

వర్షాకాలంలో బలంగా వీస్తున్న ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు అటుఇటు ఊగడం.. కొన్ని సందర్భాల్లో ఎర్తింగ్ కావడం సమస్యలకు దారితీస్తోంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇటీవల కాలంలో డిష్ కేబుల్ వైర్లు, వివిధ నెట్‌వర్క్‌లకు సంబంధించిన వైర్లు విద్యుత్ స్తంభాలకు వేలాడదీయడం ఆనవాయితీగా మారింది. ఈ మూడు పట్టణాల్లో డిష్ కేబుల్, నెట్‌వర్క్ వారు విద్యుత్ స్తంభాలను వాడుకున్నందుకు ఒక్కో స్తంభానికి రూ.20 చొప్పున మెట్‌పల్లిలో నెలకు సుమారు రూ.35వేలు, కోరుట్లలో సుమారు రూ.70వేలు, జగిత్యాలలో సుమారు రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఇటీవలి భారీ వర్షాలు, బలమైన గాలులకు కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు ఊగి ఒకదానికొకటి తగిలి డిష్ వైర్లకు కనెక్ట్ కావడం సమస్యగా మారుతోంది. ఫలితంగా డిష్ కేబుల్, నెట్‌వర్క్ వైర్లకు కరెంటు సరాఫరా అయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మెట్‌పల్లిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటనే దీనికి ఉదాహరణ.

తొలగించండి.. లేదా లెక్క తేల్చండి..

ఇటీవల ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలకు ఉన్న డిష్ కేబుల్, నెట్‌వర్క్ కేబుళ్లను తొలగించాలని, లేదా ఎన్ని విద్యుత్ స్తంభాలు వాడుకుంటున్నారో కచ్చితమైన లెక్కతీయాలని ఆదేశించారు. ఈ విషయంలో కింది స్థాయి విద్యుత్ అధికారులు ఇప్పటికే కొన్నిచోట్ల డిష్ కేబుల్, నెట్‌వర్క్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. నిర్వాహకులు కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసే సిగ్నల్ రిసీవర్ పరికరాలు విద్యుత్ షాక్ సంబంధిత సమస్యలకు కారణమవుతున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే డిష్‌కేబుల్, నెట్ వర్క్‌వైర్లు ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే పరిస్థితులు రావడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తొలగించాలని చెబుతున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభాలకున్న డిష్‌కేబుల్, నెట్‌వర్క్ వైర్లను తొలగించాలని చెబుతున్నాం. విద్యుత్ స్తంభాల వాడకంపై లెక్క తేల్చాలని ఆదేశించాం. ఎక్కువ విద్యుత్ సర్వీస్ వైర్లు ఒకేచోట ఉన్న ప్రాంతాల్లో ఏదైనా వైర్ తెగిపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.
– అంజన్‌రావు, ఏడీఈ, కోరుట్ల

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లతో పాటు, టీఆర్‌నగర్‌లోని బాలసదన్, వృద్ధాశ్రమం, బీట్‌బజార్‌లోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సైతం సరైన వసతులు లేవని, వారికి కూడా మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

న్యాక్‌తో ఉపాధి

న్యాక్ సెంటర్‌తో చాలా మందికి ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి న్యాక్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాక్ అనుబంధంగా కొనసాగేలా ముఖ్యమంత్రి స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రూ.5 కోట్లతో అడ్వాన్స్ ట్రైనింగ్ మంజూరైందన్నారు. న్యాక్ కేంద్రానికి 700 మీటర్ల దూరంలో 5 ఎకరాల స్థలాన్ని సైతం ఆర్డీవో గుర్తించారని, త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం సమీకృత మార్కెట్‌ను పరిశీలించారు. త్వరలోనే మార్కెట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అనంతరం టీఆర్‌నగర్‌లోని బాలసదన్‌ను పరిశీలించి వయోవృద్ధుల భవనం కోసం రూ.75 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈలు శేఖర్‌రెడ్డి, రహమాన్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, కూసరి అనిల్, రాంమోహన్‌రావు, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

చిత్తశుద్ధితో పనిచేయాలని పదోన్నతి పొందిన తహసీల్దార్లకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. తహసీల్దార్లు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అడిషనల్ కలెక్టర్ రాంబాబు, ఏవో హన్మంతరావు, ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి, చిలుకల కృష్ణ, హరి అశోక్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మబ్బుల కెరటం



కోరుట్ల: కోరుట్ల మండలం అయిలాపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు సముద్రపు కెరటాలను తలపించాయి. మబ్బులు కమ్ముకోవడంతో ఒక్కసారి గ్రామంలో చీకటి అలుముకుంది.

ఆర్టిజన్స్ సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్లు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఏళ్ల తరబడి ఆర్టిజన్స్‌గా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్టిజన్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హర్షం

బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించడంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి, యువజన కాంగ్రెస్ నాయకుడిగా, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఎదగడం ఆయన నాయకత్వ లక్షణాలకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతమై రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నట్లు జీవన్‌రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: ప్రభుత్వ ఐటీఐలో నాల్గో దశ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. మొదటి, రెండు, మూడో దఫాలో మిగిలిన సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు iti.telangana. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

గణాధిత్య తండ్రికి అటెండర్‌గా అవకాశం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో అస్వస్థతకు గురై మృతిచెందిన విద్యార్థి రాజారపు గణాధిత్య తండ్రి మహేశ్‌కు కోరుట్ల మండలం కల్లూరు మోడల్ స్కూల్‌లో అటెండర్‌గా అవకాశం కల్పిస్తూ వారధి సొసైటీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 24- 2025 వరకు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏడు రోజుల్లో విధుల్లో చేరాలని అందులో పేర్కొన్నారు. కాగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

‘నిందితుడిని ఉరితీయాలి’



రాయికల్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్(జగిత్యాల): ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ప్రభుత్వం వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, నిందితుడిని వెంటనే ఉరి తీసి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సామల్ల అంజలి, కుర్మ లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు వాసం రమ, రాష్ట్ర నాయకులు కుర్మ మల్లారెడ్డి, మచ్చ నారాయణ, పట్టణ నాయకులు బో దుగం శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, సుమన్, మంగళారపు లక్ష్మీనారాయణ, రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



సభ్యత్వ నమోదు అందజేస్తున్న సంఘం నాయకులు

సారంగాపూర్(జగిత్యాల): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు పాఠశాలల్లో మన ఊరు- మన బడి పథకంలో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేస్తేనే మౌలిక వసతులు మెరుగుపడతాయన్నారు. పే రివిజన్ కమిటీ రిపోర్టు తెప్పించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పే స్కేలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు పత్తెం వెంకటేశ్వర్లు, శ్రవణ్‌కుమార్, మండల అధ్యక్షుడు జకిలేటి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉన్నా లేనట్టే..

- ‘ఎస్‌డీపీ’ పనిచేసేదెప్పుడో..?
- జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు
- ప్లేట్‌లెట్స్ ఎక్కించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- తడిసిమోపెడవుతున్న ఖర్చు



ఎస్‌డీపీ యంత్రం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఏరియా ఆస్పత్రి జనరల్ ఆస్పత్రిగా మారింది. ప్రస్తుతం అందులో అన్ని విభాగాలున్నాయి. కానీ, టెక్నీషియన్స్, సరిపడా సిబ్బంది లేకపోవడంతో పరికరాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈనేపథ్యంలో పేదలకు ఉచితంగా అన్ని రకాల వైద్యం అందించాలన్న ప్రభుత్వ ఆశయం ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదు.

వృథాగా యంత్రం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) యంత్రం వృథాగానే ఉంటోంది. జిల్లాలో డెంగీ కేసులు నిత్యం వెలుగు చూస్తునే ఉన్నాయి. ఒకవేళ రోగికి ప్లేట్‌లెట్స్ తగ్గితే అవసరమైన రక్తకణాలను దాత రక్తం నుంచి వేరు చేసి అందించాల్సి ఉంటుంది. ఇలా వేరుచేసే యంత్రం అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అది కాస్త మూలనపడింది.

పెరుగుతున్న డెంగీ కేసులు

జిల్లాలో గత రెండు నెలల్లోనే 200 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్లేట్‌లెట్స్ పేరిట ప్రైవేటు ఆస్పత్రుల్లో అందినకాడికి దోచుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. డెంగీ బారినపడినవారికి ప్లేట్‌లెట్స్ 10 వేలకన్నా తక్కువకు పడిపోతే మళ్లీ ఎక్కించాల్సి ఉంటుంది. కాగా, ప్రభుత్వ ఆస్పత్రిలో ఎస్‌డీపీ యంత్రం ఉన్నప్పటికీ అది ఉపయోగంలో లేకపోవడంతో బాధితులు ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక వ్యక్తికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాలంటే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అవుతుందని అంచనా. ఈక్రమంలో ఎస్‌డీపీ యంత్రాన్ని ఉపయోగంలోకి తెస్తే ప్రజలకు ఎంతో వెసులుబాటుగా ఉంటుంది.

రెండురోజుల్లో అందుబాటులోకి..

సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) యంత్రం అందుబాటులోకి వచ్చింది. బ్లడ్ బ్యాంక్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు వచ్చాయి. ప్రస్తుతం 9 కిట్లు అందుబాటులో ఉన్నాయి. రెండుమూడు రోజుల్లో యంత్రాన్ని ప్రారంభిస్తాం.
– నవీన్, ఆర్ఎంవో

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎంలు పద్మజ, రత్నాకర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–15 సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను హైస్కూల్ హెచ్‌ఎం పద్మజ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి ప్రారంభించారు. పలు పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు హాజరయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టును ఈ నెల 14, 15వ తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ స్వరూపారాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో

సామగ్రి దగ్ధం

ధర్మపురి: షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధమైన ఘటన ధర్మపురి మండలంలోని నేరెళ్లలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నేరెళ్లకు చెందిన నూకల సత్తవ్వ కుటుంబసభ్యులు గురువారం రాత్రి ఇంట్లో కూలర్ వేసుకొని, నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక కూలర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికి మెలకువ రావడంతో కుటుంబసభ్యులందరూ భయాందోళనకు గురై, బయటకు పరుగులు తీశారు. అప్పటికే మంటలు వ్యాపించి, ఇంట్లోని మంచాలు, టీవీ, దుస్తులు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.8 వేలతోపాటు 25 కిలోల బియ్యం అందజేశారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి పర్యటించారు. నమిలికొండ హైస్కూల్లో టాయిలెట్స్, కిచెన్ షెడ్, క్లాస్‌రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్తాచెదారం తొలగించాలని ఆదేశించారు. అనంతరం హిమ్మత్‌రావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి తదితరులు

రేపు ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. హాజరవ్వాలనుకునే క్రీడాకారుల ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లు దాటరాదని తెలిపారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఉప్పుమడుగులో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అల్మాస్, షేక్ హైదర్‌లు బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



బియ్యం, నిందితులను చూపుతున్న పోలీసులు

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి



బాబు (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): చేపల వేటకు వెళ్లి, గల్లంతైన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్సై సత్తయ్య కథనం ప్రకారం.. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లికి చెందిన గన్నెబోయిన బాబు(52) గత మంగళవారం రాత్రి స్థానిక చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతూ నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా శుక్రవారం చెరువు మత్తడికి కొద్ది దూరంలో అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

మెట్‌పల్లి(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని డీడీనగర్ కాలనీకి చెందిన నలివేని ఎల్లమ్మ(43) ఈ నెల 2న పనిమీద ఇంటి నుంచి బయటకు వచ్చింది. స్థానిక ఓ గార్డెన్స్‌కు వరకు వెళ్లి, అక్కడ రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల కల్చరల్: బాలికపై లైంగికదాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. 2018 డిసెంబర్ 25న ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో స్థానికుడైన చీపెల్లి మల్లయ్య ఆమె వద్దకు వచ్చాడు. బిస్కెట్లు ఆశ చూపి, మాయమాటలు చెప్పి, తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని బాధితురాలు మరుసటి రోజు తల్లికి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట పోలీసులు మల్లయ్యపై పోక్సో కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ శ్రీనివాస్ వాదించగా సీఎంఎస్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో 12 మంది సాక్షులను విచారించారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి, మల్లయ్యకు శుక్రవారం శిక్ష ఖరారు చేశారు.

వరద కాలువలో వ్యక్తి మృతదేహం

గంగాధర(చొప్పదండి): మండలంలోని ర్యాలపల్లి శివారు వరద కాలువలో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. లోపల పైపులకు తట్టుకోవడంతో శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులకు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డుపై బొట్ల శ్రీనివాస్ అని ఉన్నట్లు పేర్కొన్నారు. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

జగిత్యాలరూరల్: అర్హులైన ప్రతీ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందని డీసీవో మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల, కల్లెడ, సారంగాపూర్ ప్రాథమిక సహకార సంఘాల్లో రుణమాఫీ పొందిన రైతులకు రూ.50 లక్షల నూతన రుణ చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ముందుగానే జాబితా తీసుకుని అర్హులైన వారిని గుర్తించి నేరుగా వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, నర్సింహారెడ్డి, మేనేజర్ మోయిజ్‌పాషా, సూపర్‌వైజర్ రాకేశ్, కార్యదర్శి గాజంగి వేణు తదితరులు పాల్గొన్నారు.

FORM-VII (see Rule 11(1))

Notice for appearance under section 13(1) of the Protection Of Women from Domestic Violence Act, 2005.

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT DHARMAPURI

D.V.C. 1 OF 2023

Between: Payela Mamatha and 2 others
Petitioner No. 1 to 3
And
Payela Srinivas and 7 others
Respondent No. 1 to 8

To,
1. Payela Srinivas S/o Chinna Rajaiah age 44 years occu: Business R/o Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist now residing at H.No. 12-110/10-3, Rallapeta, Road No. 2, Manchirial dist. PIN 504 208
2. Payela Amruthamma W/o Chinna Rajaiah age 65 years Occu: Agriculture R/O Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist now residing at H.No. 12-110/10-3, Rallapeta, Road No. 2, Manchirial dist. PIN 504 208
3. Payela Sunitha w/o Venugopal age 43 years Occu: Business R/o. Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist Now residing at Sri Venkateswara Welding and Work Shop, Opp Sai Saketha Hospital, Beet Bazaar, Luxxettipet proper and mandal of Manchirial dist. Pin 504 215.
4. Kandrapu Mangamma W/o Laxman age 45 years Occu: Agriculture R/o. Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist PIN 505 425.

Whereas the petitioner No. 1 to 3 has filed an application under section 12 of the Protection of Women from Domestic Violence Act, 2005.

You are hereby directed to appear before this court on the day of 25-09-2024 at 10-30 a.m. personally or through a duly authorized counsel of this court to show cause why the reliefs claimed by the Applicant against you should not be granted, failing which the court shall proceed ex parte against you

Given under my hand and the seal of the court, this the 23rd day of August 2024

// By order of the court//

Sd/- **DUMMENA SRINIVAS,**
Advocate Jagtial

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ITI Admissions

■ సాయి Pvt. I.T.I., జగిత్యాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ & మెకానిక్, డీజిల్ ట్రేడ్లలో చివరి అవకాశముగా అడ్మిషన్లు జరుగుచున్నవి. వెంటనే సంప్ర: సెల్: 8106371128. గమనిక: B.Tech/Diploma in Electrical, Mechanical, MBA/ MCA వారు Instructor గా పని చేయుటకు కావలెను. sai-iti1992@gmail.com కు దరఖాస్తు చేసుకోగలరు. [K- 1246695]

SERVICES

BUSINESS OFFER

■ నిజంగా డబ్బులు సంపాదించాలి అనే వాళ్లకు, మంచి అవకాశం నెలకు 30 K - లక్ష సంపాదన మీ వాట్సప్ స్టేటస్‌తో. ఫోన్: 9948217574 [SCA24000234]

WANTED

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824















